



ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలకు పూర్తయిన ఏర్పాట్లు

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు రైతు



చంద్రశేఖర్

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగే 76వ గణతంత్ర వేడుకలకు ఏడుగురు అభ్యుదయ రైతులను కుటుంబ సమేతంగా ప్రత్యేక అతిథులుగా పంపాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆహ్వానం పంపిందని ఏపీఎంఐపీ కర్నూలు జిల్లా పీడీ ఉమాదేవి తెలిపారు. శనివారం ఏపీఎంఐపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉద్యాన శాఖ రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని క్రిష్ణగిరి, పార్వతీపురం మన్యం, ఏలూరు, పల్నాడు, కడప, తిరుపతి జిల్లాల్లో సూక్ష్మ సేద్యం కింద ఉద్యాన పంటలు సాగు చేస్తున్న ఏడుగురు అభ్యుదయ రైతులను సతీసమేతంగా ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనడానికి ఆహ్వానం వచ్చిందని అన్నారు. ఈ ఉత్తర్వులు ఏపీఎంఐపీ కార్యాలయానికి శనివారం వచ్చాయని అన్నారు. కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం కోవెలకుంట్ల గ్రామానికి చెందిన యు. చంద్రశేఖర్ ఈ ఆహ్వానం మేరకు ఢిల్లీ వెళ్లనున్నారని తెలిపారు.

నేడు రిపబ్లిక్ డే

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న కలెక్టర్

నంద్యాల కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే 76వ గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా రిపబ్లిక్ డే సంబరాలు ఆదివారం ఘనంగా జరగనున్నాయి. ఉదయం 9 గంటలకు కలెక్టర్ రాజకుమారి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అదేవిధంగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. పరేడ్ గ్రౌండ్‌లో జరిగే కవాతులో సాయుధ దళాలు పాల్గొంటాయి. ఈ సందర్భంగా పలు స్టాళ్ల ఏర్పాటు, ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, దేశభక్తి గీతాలకు విద్యార్థుల నృత్య ప్రదర్శన, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది 9 కీలక శాఖలకు ఉత్తమ అవార్డులు, 60 మంది పోలీసులకు ప్రశంసాపత్రాలను అందజేస్తారు.

సమగ్ర శిక్ష నిర్వహించిన టెండర్లలో గోల్ మాల్ జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలకు 51 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయడానికి సమగ్ర శిక్ష టెండర్లను పిలిచింది. అయితే అందులో ఐదింటికి ఒక రూల్, ఆరో టెండర్‌కు మరో రూల్ పాటించారన్న విమర్శలు ఉన్నాయి. ఆరో టెండర్‌కు మాత్రమే సర్దుబాటు నిబంధన అమలు చేసి అడ్డదారిలో అనర్హులకు అప్పగించిందని టెండర్‌లో పాల్గొన్న వ్యక్తులు ఆరోపిస్తున్నారు. ఒక టెండరును ఒకరికి కాకుండా మరో ఇద్దరికి కలిపి ఇవ్వడం.. అది కూడా కడప జిల్లా వాసులకు కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. జాయింట్ కలెక్టర్ సమక్షంలో జరిగిన టెండర్లలోనే అవకతవకలు జరగడం దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంపై టెండర్‌లో పాల్గొన్న కొందరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించడం గమనార్హం.



సమగ్రత ఏదీ..?

- సమగ్ర శిక్ష టెండర్లలో గోల్‌మాల్...!
- ఐదు టెండర్లకు ఒకలా.. ఆరో టెండర్‌కు మరోలా
- సర్దుబాటు పేరుతో అనర్హులకు అప్పగింత
- ఒకే టెండర్‌ను ముగ్గురికి పంచడంపై విమర్శలు
- పైగా కడప వాసులకు ఇవ్వడంపై అనుమానాలు
- కోర్టును ఆశ్రయించిన బాధితులు

నంద్యాల జనవరి 25, (ఆంధ్రజ్యోతి):

గత నెల 21న టెండర్ నోటిఫికేషన్

కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు నిత్యావసర సరుకుల పంపిణీ చేసేందుకు గత నెల 21వ తేదీన టెండర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో అర్హులైన వారు డిపాజిట్ చెల్లించి టెండర్‌లో పాల్గొన్నారు. ఆ తర్వాత గత నెల 31వ తేదీన సదరు కమిటీ చైర్మన్ జాయింట్ కలెక్టర్ కావడంతో ఆయన చాంబర్‌లో టెండర్లను తెరిచారు. సర్వశిక్ష పరిధిలోని కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు సంబంధించి పిలిచిన ఆరు టెండర్లలో ఎంపిక కమిటీ ఐదు టెండర్లు తక్కువ ధరకు కోడ్ చేసిన వారికే అప్పగించింది. ఇందులో ఎక్కడా ఎలాంటి సమస్య లేదు. అయితే ఆరో టెండరు విషయంలో మాత్రమే సదరు కమిటీ సర్దుబాటు నిబంధన అమలు చేసింది. తక్కువ ధరకు కోడ్ చేసిన వ్యక్తికే ఇవ్వకుండా అనర్హులైన మరో ఇద్దరికి కలిపి అప్పగించింది. అది కూడా టెండర్ వేసిన తొమ్మిది మందిలో తక్కువ ధరకు కోడ్ చేసిన వారి జాబితాలో ఉన్న మొదటి, రెండు, మూడు స్థానాల్లో ఉన్న వ్యక్తులకు కాకుండా నాలుగో వ్యక్తికి, ఆ తర్వాత ఐదు, ఆరు స్థానాల్లో ఉన్న వ్యక్తికి కాకుండా ఏడో వ్యక్తికి కలిపి సదరు టెండర్‌ను సర్దుబాటు పేరుతో కేటాయించింది. అసలైన టెండరుదారుడితోపాటు మరో ఇద్దరిని కలిపి ఆయా స్కూళ్లను వారికి పంచి టెండర్ నియామక పత్రాలను అందజేయడం పలు విమర్శలకు తావిస్తోంది. చివరకు తక్కువ ధర కోడ్ చేసిన వ్యక్తి తనకు మాత్రమే ఇవ్వాల్సిన టెండరును మరో ఇద్దరికి కలిపి ఇవ్వడంతో షాక్ గురయ్యాడు.

టెండర్ ముగ్గురికి ఇచ్చినా..

సదరు కమిటీ సర్దుబాటు పేరుతో ఒకే టెండర్‌ను ముగ్గురికి ఇవ్వడం కూడా చర్చగా మారింది. తక్కువ ధరకు కోడ్ చేసిన కర్నూలుకు చెందిన శ్రీనివాస ట్రేడర్స్‌కు కాకుండా మరో ఇద్దరికి స్కూళ్లను విభజించి ఇచ్చింది. విషయం తెలుసుకున్న మిగిలిన ఆరుగురు టెండర్‌దారులు అభ్యంతరం తెలిపినా అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో వీరందరూ కలిసి న్యాయం కోసం కోర్టుకు వెళ్లారు. టెండరు ముగ్గురికి వచ్చినప్పటికీ తక్కువ ధరకు కోడ్ చేసిన వ్యక్తి మాత్రమే ఇప్పటికీ ఆయా స్కూళ్లకు ప్రొవిజన్స్ సరఫరా చేశారని సమాచారం. మిగిలిన ఇద్దరు భవిష్యత్తులో ఎలాంటి సమస్య వస్తుందోనని ఆందోళనతో ఇప్పటి వరకు సరఫరా చేయలేదని ఆ శాఖ వర్గాల ద్వారా తెలిసింది.



కడప జిల్లా వాసులకు ఇవ్వడంలో ఆంతర్యమేంటో..?

ప్రొవిజన్స్ టెండర్‌కు కోడ్ చేసిన టెండరుదారుల వివరాలు ఇలా...

శ్రీ శ్రీనివాస ట్రేడర్స్	- రూ. 2,71,731.04
మదీనా ట్రేడర్స్	- రూ. 2,81,845.80
ఎంఎస్ ట్రేడర్స్	- రూ. 2,84,604.04
శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్	- రూ. 2,97,970.70
హనుమాన్ ట్రేడర్స్	- రూ. 3,05,408.00
నందన ట్రేడర్స్	- రూ. 3,10,952.57
కేవీఆర్	- రూ. 3,18,234.61
లక్ష్మీప్రసాద్	- రూ. 3,70,716.00
కేవీసీఎస్	- రూ. 3,90,442.00

టెండర్ ఎంపిక కమిటీ సభ్యులుగా ఎస్ఎస్ఏ పీవో, జీసీడీవో, డీఈవో సభ్యులుగా, జాయింట్ కలెక్టర్ చైర్మన్ ఉంటారు. ఈ కమిటీ టెండర్ల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అయితే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వారికి కాకుండా కడప జిల్లాలోని ప్రొద్దుటూరు, పులివెందులకు చెందిన కేవీఆర్ ఆగ్రోస్, శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్ వారికి సర్దుబాటు నిబంధన పేరుతో అప్పగించడం పలు విమర్శలకు తావిస్తోంది. కడప జిల్లాకు చెందిన ఆ ఇద్దరు కూడా అక్కడి ప్రజాప్రతినిధులకు సమీప బంధువులు కావడంతోనే కేటాయించారని తెలుస్తోంది. దీనికితోడు కమిటీలోని కొందరు సభ్యులు మామూళ్లు కూడా తీసుకొని ఒకే టెండర్‌ను ముగ్గురికి సర్దుబాటు చేశారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకొని అర్హులైన వారికి న్యాయం జరిగే విధంగా చూడాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో ఇటీవల ఎంపిక చేసిన టెండర్లు.. వాటి వివరాలు..

టెండర్లలో రకాలు	వాటి ధరలు	డిపాజిట్ అమౌంట్
ప్రొవిజన్స్	రూ. 6,43,84,760	రూ.12,87,695
వెజిటెబుల్స్	రూ. 1,75,38,840	రూ.3,50,777
ఫ్రూట్స్	రూ. 96,49,200	రూ. 1,92,984
ఎగ్స్	రూ. 96,49,200	రూ. 1,92,984
చికెన్	రూ. 75,68,000	రూ.1,51,360
ఇతర వస్తువులు	రూ. 9,41,400	రూ.18,840

కలెక్టర్‌కు ఉత్తమ ఎలక్టోరల్ అవార్డు



అందుకుంటున్న కలెక్టర్

నంద్యాల కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా 2024 ఎన్నికల నిర్వహణలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ప్రస్తుత నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఉత్తమ ఎలక్టోరల్ అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ రాష్ట్ర స్థాయి అవార్డును శనివారం అమరావతిలో నిర్వహించిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో ప్రదానం చేసి ప్రశంసా పత్రాన్ని ఇచ్చారు. 2024 సాధారణ ఎన్నికలలో అత్యుత్తమ విధులు నిర్వహించిన గుంటూరు జిల్లా అప్పటి జాయింట్ కలెక్టర్‌గా, మంగళగిరి రిటర్నింగ్ అధికారిగా ఆమెకు ఈ అవార్డు లభించింది.

ఓటరుగా నమోదు చేసుకోండి

జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని ఓటు అని, అర్హులైన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ విష్ణుచరణ్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. అనంతరం యువ ఓటర్లకు, సీనియర్ సిటిజనులకు ఎపిక్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, నంద్యాల, ఆత్మకూరు, డోన్ రెవిన్యూ డివిజనల్ అధికారులు చల్లా విశ్వనాథ్, నాగజ్యోతి, నరసింహులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు మరో అవకాశం

- ఇన్‌చార్జి ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

కర్నూలు క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుళ్ల నియామక దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమైనప్పటి నుంచి వివిధ కారణాలతో ఇప్పటి వరకు గైర్హాజరైన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీన హాజరు కావాలని ఇన్‌చార్జి ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా శనివారం తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతల సర్టిఫికెట్లు, క్రిమిలేయర్, కుల ధృవీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్లు, ఇతర స్టేజ్-1, స్టేజ్-2లో అప్‌లోడు చేసుకున్న మేరకు సరైన ధృవపత్రాలు, ఒరిజినల్స్ తీసుకుని రావాలన్నారు. గత నెల 30నుంచి కొనసాగుతున్న ఈ దేహదారుఢ్య పరీక్షలు ఈ నెల 28న ముగియనున్నాయని ఆయన తెలిపారు.

యువకుడి అదృశ్యం కలకలం
- బెట్టింగ్ యాప్స్ దెబ్బకు రూ.13 లక్షల అప్పులు
- ఆత్మహత్య చేసుకుంటున్నానని ఆరు పేజీల లేఖ
- ఆరు బృందాలతో పోలీసుల గాలింపు

9

నిరుద్యోగ యువత నైపుణ్యం పెంచుకోవాలి
పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రణాళికాబద్ధంగా క్యూలైన్లు

- క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉండే భక్తులకు మంచి నీరు, అల్పాహారం
- వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లులకు ప్రత్యేక క్యూలైన్లు
- శ్రీశైలం దేవస్థానం ఈవో శ్రీనివాసరావు



శ్రీశైలంలో క్యూలైన్లను పరిశీలిస్తున్న ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 25 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని వచ్చే భక్తులకు దర్శనానికి ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించాక మాట్లాడుతూ .. ఈ ఏడాది శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం టికెట్ల కౌంటర్లను మరోచోటికి మార్చి భక్తులు వెళ్లే క్యూలైన్లకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని అన్నారు. క్యూకాంప్లెక్స్‌లో వేచివుండే భక్తులకు అల్పాహారం, మంచినీరు, బిస్కెట్లు నిరంతరం అందజేయాలన్నారు. ఈయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మురళీబాలకృష్ణ, నరసింహారెడ్డి, ఏఈవో స్వాములు, శ్రీశైల ప్రభ సంపాదకుడు డాక్టర్ సీ. అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ డీఈఈ చంద్రశేఖరశాస్త్రి తదితరులు ఉన్నారు.

మండపం కూల్చివేతపై విచారణ

మహానంది, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో నిశ్చితార్థ మండపం కూల్చివేతపై శనివారం లోకాయుక్త విచారణ చేపట్టింది. ఏడాది క్రితం రాతి నిశ్చితార్థ మండపాన్ని కూల్చివేశారు. దీంతో ఎవరి అనుమతి తీసుకొని కూలగొట్టారని శనివారం సాయంత్రం లోకాయుక్త అధికారి దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఆలయ ఉన్నత స్థాయి అధికారిని ప్రశ్నించినట్టు తెలిసింది. మహానంది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన స్వామి వారి నిశ్చితార్ధ మండపాన్ని అభివృద్ధి పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా గతంలో కూల్చడంపై కొందరు లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే లోకాయుక్త అధికారి స్థాయి మహానంది చేరుకొని ఇందుకు గల కారణాలను తెలుసుకొని వెళ్లారని ఆలయ వర్గాలు తెలిపాయి.

హంద్రీ నీవా ఎస్ఈగా వరప్రసాద్

కర్నూలు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ ఎస్ఈ ఎంఎల్ఎన్ వరప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎఫ్ఏసీ ఇన్‌చార్జి ఎస్ఈ సురేశ్‌బాబు ద్వారా ఆయన బాధ్యతలు స్వీకరించారు. గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు పాణ్యం ఈఈగా పని చేస్తున్న వరప్రసాద్ ఈ నెల 17న ఎస్ఈగా పదోన్నది ఇచ్చి హంద్రీనీవా కర్నూలు సర్కిల్ ఎస్ఈగా బదిలీ చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టు ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఈఈలు శివప్రసాద్, మల్లికార్జునరెడ్డి తదితరులు ఆయనను కలసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఇన్‌చార్జి ఎస్ఈగా పని చేసిన సురేశ్‌బాబు అవుకు ఈఈగా కొనసాగుతారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'ఎత్తు పెంచాలి'

పాములపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పాములపాడు, చెలి మిల్ల మధ్య అండర్ బ్రిడ్జి నిర్మాణం ఎత్తు మరో 5 అడుగుల మేర పెంచా లని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గ్రామస్థు లతో కలిసి హైవే పనులు అడ్డుకున్నారు. చెలిమిల్ల సర్పంచ్ చంద్రారెడ్డి, మండల కో ఆప్టెడ్ మెంబర్ సయ్యద్ ముర్తుజావలి, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

జాతీయ ఓటర్ల దినోత్సవంలో ప్రముఖులు





పగిడ్యాల, కొత్తపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



బండిఆత్మకూరులో ర్యాలీ

ఆత్మకూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటు వజ్రాయుధమని, ఓటు ప్రాముఖ్యతను గుర్తించాలని ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రవణమ్మ సబ్ ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్ సాజిద్‌బాషా అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ సిటిజన్లను సత్కరించారు. అలాగే ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఓటరు బాధ్యతను కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ నేతృత్వంలో విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యంపై వివరించారు.

మహానంది: గాజులపల్లిలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామంలోని 9 పోలింగ్ బూత్‌లలో బీఎల్వోల ఆధ్వర్యంలో హెచ్ఎం రవణమ్మ ప్రతిజ్ఞ చేయించారు. బీఎల్వోలు ఇర్ఫాన్, లింగమయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: బండిఆత్మకూరులో ఓటర్ల దినోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు. ప్రతిజ్ఞ చేయించారు. డీటీ గురున్నాథం తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: ఓటు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని పాణ్యం తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు మండల పరిధిలోని సీనియర్ ఓటర్లను సన్మానించారు. నూతనంగా ఓటు నమోదు చేసుకున్న యువతీ యువకులకు ఓటరు కార్డులు అందజేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ సేవలందించిన మహేష్‌బాబు, విశ్వవాణి, పద్మభూషణమ్మ, ప్రవీణ్‌కుమార్‌కు ఉత్తమ బీఎల్‌వో అవార్డులు అందజేశారు. డీటీ శివశంకరరెడ్డి, ఆర్ఐ రాము, ఎంపీటీసీ రంగరమేష్, మాజీ ఉపసర్పంచ్ రమణమూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. వడ్డుగండ్ల, రసూల్లపేట గ్రామాలలో ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పగిడ్యాల: ఓటు వజ్రాయుధం అని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో సుమిత్రమ్మ సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవాని పురస్కరించుకొని శనివారం పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయం వద్ద ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో వీఆర్వోల ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు.

కొత్తపల్లి: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న సూచించారు. శనివారం కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించి కార్యాలయ అధికారులు, సిబ్బందితో కలిసి ఓటర్ల దినోత్సవాన్ని ప్రతిజ్ఞ చేయించారు.



మహానంది: గాజులపల్లిలో..



ఆత్మకూరులో అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్



పాణ్యం: ఓటరుకు కార్డును అందజేస్తున్న తహసీల్దార్

వెదుర్లు స్వాధీనం

బండిఆత్మకూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతజూటూరు గ్రామ సమీపాన 300 వెదుర్లు స్వాధీనం చేసుకున్నట్లు రేంజ్ అధికారి నజీర్‌ఖా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత రాత్రి వచ్చిన సమాచారం మేరకు సంతజూటూరు సమీపాన అటవీ సిబ్బంది నాగరాజు, ప్రసన్న దాడి చేసి రూ.20వేల విలువ చేసే 300 వెదుర్లు స్వాధీనం చేసుకున్నారని, ఇందుకు సంబంధించిన ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు. స్వాధీనం చేసుకున్న వెదుర్లను బండిఆత్మకూరు రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

'బకాయిలు చెల్లించాలి'

నంద్యాల రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతన సవరణ బకాయిలు చెల్లించాలని పాల (పాల్‌టెక్నికల్ ఆల్ లెక్చరర్ అసోసియేషన్) ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు శరత్ రాఘవేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో స్టేట్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబరు 10 ప్రకారం వేతన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 12 ఏళ్లుగా కెరీర్ అడ్వాన్స్‌మెంట్స్ స్కీమ్‌కు నోచుకోలేదన్నారు. టెక్నికల్ ఎడ్యుకేషన్ నుంచి హైయ్యర్ ఎడ్యుకేషన్ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి నరసింహారావు, సుభాన్, ట్రెజరర్ మహేష్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు అవగాహన

నంద్యాల క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నియమా లపై జిల్లా రవాణా శాఖ అధికారి ఐశ్వర్య డ్రైవర్లకు అవగాహన కల్పిం చారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్స వాల్లో భాగంగా శనివారం జిల్లా రవాణా శాఖ ఆధ్వ ర్యంలో పట్టణంలోని శాంతి నికేతన్ విద్యాల యంలో ఆ పాఠశాల బస్సు డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మోటార్ వాహన తనిఖీ అధికారి శ్రీకాంత్, ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జున గుప్తా, శాంతి నికేతన్ విద్యాసంస్థల అధినేత సూర్య దేవర సుధాకర్, పాఠశాల బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

'సర్వే పకడ్బందీగా చేపట్టాలి'

ఆత్మకూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి వెళ్లి కుష్ఠు వ్యాధి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజశ్వనీ, డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ డీవీరమణ సూచించారు. శనివారం ఇంటింటి కుష్ఠువ్యాధి సర్వే గురించి స్థానిక వైద్యాధి కారు లు గోపాల్, సాజిదా ఫిర్దోస్, దీపా నాగవేణితో సమీక్షిం చారు. వీరి వెంట సూపర్ వైజర్లు మస్తానయ్య, గుర్రప్ప, రమణమ్మ ఉన్నారు.

'సద్వినియోగం చేసుకోవాలి'

గడివేముల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య శిబిరాలను పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు సూచిం చారు. కొరటమద్ది, బిలకల గూడురు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. లేగ దూడలకు నట్టల నివారణ మందులను తాపిం చారు. ఏపీఎల్‌డీఏ ఎగ్జిక్యూ టివ్ ఆఫీసర్ రాజశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ కమలాకర్, పశు వైద్యాధికారులు నవీన్, పావని, గొర్రెల సంఘం డైరెక్టర్ యుగంధర్ తదిత రులు పాల్గొన్నారు.

వైభవంగా అష్ట నాగ సహిత ఆశ్లేష బలి పూజ



పూజలో పాల్గొన్న భక్తులు

నంద్యాల కల్చరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ రామాలయంలో మహాసుదర్శన యాగ పూర్వక అష్ట నాగ ఆశ్లేష బలి పూజా సహిత సుబ్రహ్మణ్య యాగంలో భాగంగా శనివారం సాయంకాలం 7గంటలకు భక్తి శ్రద్ధలతో విశేష అష్టనాగ పూజా సహిత ఆశ్లేష బలి పూజ నిర్వహించారు. యడవల్లి కార్తికేయ శర్మ, భగవత్ సేవా సమాజ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో విద్యార్థుల ఘర్షణ

● ఓ విద్యార్థికి విరిగిన ఎడమ చేతి భుజం ఎముక

మహానంది, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. తిమ్మాపురంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో శనివారం మధ్యాహ్నం పాఠశాల విరామం సమయంలో విద్యార్థులు నిఖిల్‌కు, లక్ష్మీనారాయణ మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో నిఖిల్ గాయపడ్డాడు. ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు నిఖిల్‌ను నంద్యాలలో తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు నిఖిల్‌కు స్కానింగ్ తీయించగా ఎడమ వైపు భుజం ఎముక విరిగినట్లు గుర్తించారు. దీనిపై విద్యాశాఖ అధికారులు విచారించి తమ కుమారునికి న్యాయం చెయ్యాలని కోరారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలలో విరామం సమయంలో ఇద్దరు విద్యార్థుల మధ్య కొద్దిపాటి తోపులాట వల్ల ఇలా జరిగిందన్నారు. నిఖిల్ తల్లిదండ్రులతో మాట్లాడామని చెప్పారు.

యువకుడిపై కత్తితో దాడి

నంద్యాల క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అప్పు విషయంలో రమేష్ అనే యువకుడిపై ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడిచేసి గాయపరచిన ఘటన శుక్రవారం రాత్రి నంద్యాల పట్టణంలో జరిగింది. అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. నంద్యాల పట్టణంలోని విశ్వనగర్‌కు చెందిన విజయ్‌కుమార్, అతడి బావమరిది శేఖర్ రాత్రి మద్యం సేవించి వెళ్తుండగా అదే సమయంలో శ్రీరామ టాకీస్ వద్ద రమేష్ వారికి ఎదురుపడ్డాడు. రమేష్ తన బైక్‌ను కొంతకాలం క్రితం విజయ్‌కుమార్ వద్ద కుదువకు పెట్టి వడ్డీకి కొంత నగదు అప్పుగా తీసుకున్నాడని, దాన్ని తిరిగి చెల్లించాలని అడగడంతో గొడవపడ్డారు. దీంతో మద్యం మత్తులో ఉన్న విజయ్‌కుమార్, శేఖర్ రమేష్‌పై కత్తితో దాడి చేశారు. ఈ దాడిలో రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన రమేష్‌ను స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ పోలీసులు తెలిపారు.

'ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు'

ఆత్మకూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు ఉంటాయని ఏడీఏ అంజనేయ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని జీఎంఆర్, మధు ట్రేడర్లతో పాటు వసుంధర ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్ దుకాణంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

పాములపాడు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కేజీ రహదారిపై కారు బైకును ఢీకొన్న సంఘటనలో శనివారం ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలివీ.. విజయవాడ నుంచి కర్నూలుకు వెళుతున్న ఓ కారు ద్వి చక్ర వాహనంపై పొలానికి వెళుతున్న బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. బైక్‌పై వెళుతున్న మౌళాలి, చిన్న వెంకటేశ్వర రావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఇచ్చన సమాచారం మేరకు 108 వాహనం అక్కడికి చేరుకుని క్షతగాత్రుల్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా వారికి అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ సురేష్ బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నటు ఆయన తెలిపారు.

'హంతకులను శిక్షించాలి'

ఆత్మకూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆలూరు ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ బండారి ఈరన్నను హత్య చేసిన వారిని శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఏపీ గ్రామీణ ఫీల్డ్ యూనియన్ నాయకులు సంపత్, శివారెడ్డి అన్నారు. శనివారం స్థానిక స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి ఏపీవో నాగమ్మకు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం నాయకులు సుధాకర్, ఎల్లానాయుడు, బ్రహ్మాచారీ, స్వాములు, సురేష్, రామకృష్ణ ఉన్నారు.

గోస్పాడు: ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మండల ఉపాధిహామీ సిబ్బంది నిరసన తెలియజేశారు. శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కర్నూలు జిల్లా ఆలూరు మండలం హరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కురువ ఈరన్నను హత్య చేయడం దారుణమని, హత్యచేసిన వారిని శిక్షించి ఆకుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ నాగఅనసూయ, ఉమామహేశ్వర్, కొర్నేల్, శ్రీనివాసులు, వీరప్ప, బాలన్న, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గడివేముల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ హుండీ ఆదాయాన్ని శనివారం పర్యావేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, శ్రీ తిరుమల శ్రీ బాలాజీ సేవా సమితి సభ్యులు లెక్కించారు. 7 నెలలకు సంబంధించి ఆదాయాన్ని లెక్కించగా రూ.6,31,702 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో రామలింగారెడ్డి తెలిపారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'రాజ్యాంగాన్ని భ్రష్టుపట్టించిన కాంగ్రెస్'

ఆత్మకూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టించింది కాంగ్రెస్ పార్టీయేనని బీజేపీ శ్రీశైలం నియోజకవర్గం కన్వీనర్ మోమిన్ షబాన అన్నారు. శనివారం సంవిధాన్ దివస్‌లో భాగంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

'అసమానతలు సవరించాలి'

ఆత్మకూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా ఏర్పాటయ్యే క్లస్టర్ పాఠశాలలో ఏర్పాటులో అసమానతలను సవరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామపక్కిరెడ్డి, సయ్యద్‌చాంద్‌బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి కోరారు. శనివారం సమగ్ర శిక్షా ఏపీసీ ప్రేమంతకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ క్లస్టర్ పాఠశాలల్లో మోడల్ స్కూళ్లలో పని చేసే ప్రిన్సిపాళ్లకు, ఉపాధ్యాయులకు అధికారాలు ఇచ్చే అవకాశం ఉందని, అయితే వారికి ఎలాంటి సర్వీసు రూల్స్ లేవన్న విషయాన్ని గుర్తించుకోవాలని అన్నారు. సర్వీసు విషయంలో కూడా సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు.

'ట్రాఫిక్ నియమాలు పాటించాలి'



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌డీపీవో

నంద్యాల క్రైం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు పాటించాలని నంద్యాల ఎస్‌డీపీవో ఎం.జావలి ఆల్ఫోన్సా సూచించారు. నంద్యాల పట్టణంలో ఎస్‌డీపీవో పర్యవేక్షణలో గురురాజా స్కూల్ యాజమాన్యం సమన్వయంతో శనివారం రోడ్డు సేఫ్టీ అవగాహన కార్యక్రమం, రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదట విద్యార్థులతో చేపట్టిన ర్యాలీని ఎస్‌డీపీవో జెండా ఊపి ప్రారంభించారు. ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జునగుప్త, టూ టౌన్ సీఐ ఇస్మాయిల్, టూ టౌన్ ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి, సురేష్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన ఉండాలి'



బ్యాగులను ప్రదర్శిస్తున్న న్యాయాధికారి తదితరులు

గోస్పాడు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భారత న్యాయ సంస్కృతిలో చట్టాలు అందరికీ సమానంగా వర్తిస్తాయని, చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలని ఆళ్లగడ్డ కోర్టు న్యాయాధికారి శైలజ సూచించారు. విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మహిళలకు గోస్పాడులో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, కుటుంబ వ్యవస్థలో మహిళలే కీలకం అని అన్నారు. కార్యక్రమానికి హాజరైన మహిళలకు విధాన్ సే సమాధాన్ లోగోతో కూడిన జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఏసీడీపీవో పద్మావతి, సీనియర్ లాయర్లు రమాదేవి, విజయ, ఈవోఆర్డీ నాగఅనసూయ, ఎస్ఐ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్




విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

నందికొట్కూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలో కేబీఎస్ గ్రానైట్స్, టైల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం బహుమతులను అంద జేశారు. గెలుపొందిన బ్రాహ్మణకొట్కూరు టీమ్‌కు మొదటి బహుమతి కింద రూ.40 వేలు, రెండో బహుమతి కర్నూలు మండలం పడిదెంపాడు టీమ్‌కు రూ.20 వేలు, మూడో బహుమతి నందికొట్కూరు పోలీస్ టీమ్‌కు రూ.10 వేలు, నాలుగో బహుమతిగా బొల్లవరం టీమ్‌కు రూ.5 వేలు అందజేశారు. ఈ క్రికెట్ పోటీలకు దాతలుగా కేబీఎస్ యజమాని మహమ్మద్ హుస్సేన్, గౌస్‌పీరా, పురుషోత్తమరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు.

తుంగభద్ర తీరం

సాహిత్యం

ఉద్వేగాలను తట్టిలేపే మానవ జీవనయానం



మానవ జీవనయానం' పుస్తకం

కర్నూలు కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): 'కడుపు చీల్చుకొని జన్మనిచ్చాను...కడుపు మాడ్చుకొని నీ కడుపు నింపాను, కష్టం తెలియకుండా కన్నీళ్లు దిగమింగి పెంచాను...కానరాని దేశం వెళ్లి కడచూపుకైనా వస్తావను కున్నా...కన్నకొడుకు కన్నా కాటికాపరే మిన్న' అంటూ సుదూర తీరాల్లో ఉండి, తన తుదిదశలోనూ రాని కన్నకొడుకు గురించి ఓ తల్లి పడే వేదనను ఈ పుస్తకంలోని ఓ కవిత అద్దం పడుతుంది. 'నాన్న వేలు పట్టి తిరగనే లేదు...నాన్న వీపు నెక్కి గుర్రమాట ఆడలేదు, అమ్మా నీ లాలిపాట వినసే లేదు...ర్యాంకుల ఫ్యాక్టరీలో మార్కుల యంత్రమైనాను నేను' అంటూ ఆర్ద్రంగా ఒక బాలుని స్వగతాన్ని మరో కవిత వినిపిస్తుంది. ఆధునిక యుగంలో మారుతున్న మానవ సంబంధాలు, మానవీయ విలువలను గుర్తు చేస్తుంది బీజీ రాజారెడ్డి రాసిన 'మానవ జీవనయానం' కవితా సంపుటి. ఎప్పుడో, ఎక్కడో మనందరికీ తారసపడిన వ్యక్తుల జ్ఞాపకాలను ఒకచోట ప్రోది చేస్తూ ఈ కవిత్వం రాశారు. సమకాలీన సమాజంలో జరుగుతున్న అనేక ఘటనలకు రాజారెడ్డి అక్షర రూపం ఇచ్చారు. ప్రపంచీకరణ ముసుగులో ఈ విశాల ప్రపంచం ఎంత ఇరుకై పోయిందీ తెలియజేశారు. బనగానపల్లె మండలం, యనకండ్ల గ్రామానికి చెందిన బీసీ రాజారెడ్డి ప్రజా ప్రతినిధిగానే కాకుండా, ప్రజా కవిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అరుణభారతి సాహితీ సంస్థను స్థాపించి, సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగు భాషామతల్లికి ఎనలేని సేవలు అందిస్తున్నారు.

సమాజ గమనానికి దిక్సూచిలా...

సమకాలీన సామాజిక సమస్యల పట్ల స్పందించే స్వభావం ప్రతి మనిషికీ ఉండాలి. అలాంటి దూరదృష్టి కలిగిన కొందరు సాహితీవేత్తల్లో బీసీ రాజారెడ్డి ఒకరు. గాడి తప్పుతున్న సమాజం పట్ల నిబద్ధత కలిగిన రచయితగా బీసీ రాజారెడ్డి 'మానవ జీవనయానం' రాశారు. సమాజంలోని స్థితిగతులకు యధాతథంగా అద్దంపట్టి పాఠకుల ముందుకు ఆ దృశ్యాలను అక్షర రూపంలో తీసుకువచ్చారు. అనునిత్యం సేవా కార్యక్రమాలతో ఉండే ఆయనలోని ఒక కొత్త కోణం ఈ పుస్తకంలో ప్రతిబింబిస్తుంది. 'మానవ జీవనయానం' పుస్తకంలో 16 కవితలు వేటికవే ప్రత్యేకంగా నిలుస్తాయి. అలాగే ఈ పుస్తకంలోని నిత్యసత్యాలన్నీ ఆణిముత్యాలే. అరుణభారతి సంస్థ ద్వారా బనగానపల్లెలో అనేకానేక సాహితీ సభలు నిర్వహిస్తున్న రాజారెడ్డి తన హృదయస్పందననే కాదు, తన సామాజిక బాధ్యతను కూడా ఈ పుస్తకం ద్వారా వ్యక్త పరిచారు. ఈ పుస్తకానికి జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి తొలిమాట రాయగా, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత ఆచార్య కొలుకలూరి ఇనాక్ ప్రశంసాత్మక సందేశం ఇచ్చారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య ప్రజాకవిగా బీసీ రాజారెడ్డిని వర్ణిస్తే, సముద్ర శాస్త్రవేత్త డాక్టర్ ఎంపీఎం రెడ్డి, కవి ఎస్ఎండీ ఇనాయతుల్లా తమ అక్షరాభినందనలు తెలియజేశారు. ఈ పుస్తకాన్ని దివంగత దర్శకరత్న దాసరి నారాయణరావు 2015 డిసెంబరు 27న హైదరాబాదులోని ఆయన స్వగృహంలో ఆవిష్కరించి, రచయితను ఘనంగా సత్కరించారు. ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాల్లో లభిస్తుంది.



'మానవ జీవనయానం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దివంగత దర్శకరత్న దాసరి నారాయణరావు (ఫైల్)

అమ్మకు జోలాలి



మెత్తటి మట్టి
పూల మొక్కకు బువ్వలా
దేహం నిండా
కనిపించని గోరుముద్ద అమ్మ...!

పురిటి గదిని తాకినప్పుడంతా
తొలి చినుకు జన్మ పరిమళంలా
అమ్మ వాసన...!

పిచ్చింది...
చివరి కోరిక అడగకుండా
చిరాయువుగా
జీవించమని
దీవించింది...!

భూమి మీద
విమోచనం లేని
తీపి వరాల
శాపగ్రస్త...అమ్మ...!

జన్మఖైదులో
కనిపించని
శిలువ
మోస్తున్న
ఆడ క్రీస్తు...!

దేహమిచ్చి
తప్పుకున్నా
అర్ధాంగిలో సగం చేరి
మళ్లీ భర్తీ అయింది...!




తన నుదుటిపై
చెమట బిందువులు
రాలినప్పుడంతా
అరుగుతోన్న గంధం
గుర్తొస్తుంది...!

\- తెలుగు వెంకటేశ్, కర్నూలు

నగరంలో నేడు

- ఉదయం 9 గంటలకు జిల్లా పోలీసు కవాతు మైదానంలో 76వ గణతంత్ర దినోత్సవం వేడుకలు ఆరంభమవుతాయి. కలెక్టర్ రంజిత్‌బాషా జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.
- ఉదయం 10.30 గంటలకు నగరంలోని సంకల్‌బాగ్‌లోగల విశ్వక్ గార్డెన్స్‌లో నెహ్రూ మెమోరియల్ హైస్కూలు (1974-1976) పూర్వ విద్యార్థుల సమ్మేళనం, గురువులకు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తున్నారు.
- మధ్యాహ్నం 12 గంటలకు నగరంలోని మౌర్య ఇన్ పరిణయ హాలులో మీడియా సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో సినిమా పరిశ్రమ అభివృద్ధికై, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ నేతృత్వంలో, మిత్రుల సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఏపీ ఫిలిమ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వివరాలు టీజీ వెంకటేశ్ తెలియజేస్తారు.
- సాయంత్రం 6.30 గంటలకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా దేశభక్తి గీతాల నృత్య ప్రదర్శనలు, దేశభక్తి గీతాల ఆలాపన ఏర్పాటు చేశారు.





కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**

వర్గీకరణ పేరుతో దళితులను చీల్చవద్దు

- సుప్రీంకోర్టు తీర్పును ఖండిస్తున్నా
- ఊయల బ్రిడ్జి వద్దు.. ఆనకట్ట బ్రిడ్జి నిర్మించాలి
- కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చింతా మోహన్



కర్నూలు అర్బన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ పేరుతో దళితులను చీల్చవద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని పూర్తిగా తప్పు పడుతున్నామని తెలిపారు. వర్గీకరణ సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దళితుల పట్ల వివక్ష చూపే జస్టిస్ మిశ్రాతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడం సమంజసం కాదని అన్నారు. నేటికి దళిత వాడలు అభివృద్ధి లేక, అంటరానితనంలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, ఓబీసీలను ఆదుకునేందుకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఒక్క శాతం నిధులు కూడా ఈ వర్గాల కోసం ఖర్చు చేయలేదని అన్నారు. రాష్ట్రంలో అమరావతి, పోలవరం కోసం వేలాది కోట్ల నిధులు అప్పులు తేవడం అవసరమా? అని ప్రశ్నించారు. ఈ భారం అంతా ప్రజలపై పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో సుందరమైన సంగమేశ్వరాన్ని సీఎం చంద్రబాబు స్వయంగా పరిశీలించి టూరిజం హబ్‌గా వసతుల కల్పించాలని కోరారు. సంగమేశ్వరం వద్ద నదిపై ఊయల బ్రిడ్జి నిర్మించడాన్ని తప్పు పట్టారు. వెంటనే ఆనకట్ట బ్రిడ్జిని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కోసం రైతులు త్యాగం చేసిన వేలాది ఎకరాల భూములను బీజేపీ, వైసీపీ నాయకులు అమ్ముకునేందుకు తెగబడుతున్నారని ఆరోపించారు. దావోస్ పర్యటనలో చంద్రబాబు సాధించిందేమీ లేదని, కేవలం మాటల గారడి తప్ప రాష్ట్రానికి పెట్టు బడులు రావడం అంత ఈజీ కాదని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అశోకరత్నం పాల్గొన్నారు.

ఆటోలు ఢీకొని పదో తరగతి విద్యార్థిని మృతి

మరో నలుగురికి గాయాలు



(అనూష ఫైల్)

మంత్రాలయం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆటోలు ఢీకొని పదో తరగతి విద్యార్థిని మృతి చెందింది. మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని చౌలహల్లి గ్రామ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. మాధవరం ఎస్ఐ విజయకుమార్ వివరాల మేరకు.. సుంకేశ్వరి గ్రామానికి చెందిన గొర్రెల ఆంజనేయ, ఈరమ్మ దంపతుల కూతురు అనూష (15) విద్యా నగర్‌లోని ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ విద్యార్థినితోపాటు అదే గ్రామానికి చెందిన ఈడిగ మూర్తి, అమృత, శ్రీలత, గౌతమిలు కూడా అదే పాఠశాలలో చదువుతున్నారు. ఆటో ఎక్కి కొద్ది దూరం వెళ్లిన తర్వాత రాయచూరు నుంచి ఆదోనికి వెళ్తున్న మరో ఆటో ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈడిగ మూర్తి, అమృత, శ్రీలత, గౌతమిలకు స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లేలోపు అనూష మృతి చెందింది. ఆంజనేయ, ఈరమ్మలకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. వీరిలో పెద్ద కొడుకు రాజు వ్యవసాయం పనులు చేస్తున్నాడు. తమ్ముడు అంజి 5వ తరగతి స్థానిక పాఠశాలలో చదువుతున్నాడు. ఉన్న ఒక్కగానొక్క కూతురును బాగా చదివించాలనుకున్న తల్లిదండ్రుల ఆశలను ఆటో ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన ఎమ్మిగనూరు ఆసుపత్రికి వెళ్లారు. మృతి చెందిన కూతురిని చూసి గుండెలవిసెలా రోదించారు. విషయం తెలుసుకున్న పాఠశాల హెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు లక్ష్మీకాంత్, జగదీష్, బాలయ్య, ఉమాశంకర్, జగదీష్, అనిత పాఠశాలకు సెలవు ప్రకటించి సంతాపం వ్యక్తం చేశారు. విద్యార్థి మృతికి నివాళులర్పించారు. మాధవరం ఎస్ఐ విజయకుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుద్యోగ యువత నైపుణ్యం పెంచుకోవాలి

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత
- మెగా జాబ్ మేళా



అపాయింట్‌మెంట్ పత్రాలు అందిస్తున్న గౌరు దంపతులు

కల్లూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ యువకులు స్కిల్స్‌ను (నైపుణ్య శక్తిని) పెంపొందించుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని దేవి ఫంక్షన్ హాలులో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, అమర్‌రాజా గ్రోత్ కారిడార్, మెడ్‌ప్లస్ సంయుక్త ఆధ్వర్యంలో మోగా జాబ్ మేళా నిర్వహించారు. 1200 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ 2014లో ఓర్వకల్లును ఇండస్ట్రియల్ కారిడార్‌గా ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటామ న్నారు. విమానాశ్రయం, జయరాజ్ ఇస్పాత్ స్టీల్‌ప్లాంట్, సోలార్ పార్క్‌ను ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్ర బాబుకే దక్కుతుందన్నారు. ఓర్వకల్లులో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించా రు. అమర్‌రాజా గ్రోత్ కారిడార్ నిర్వాహకులతో చర్చించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

యువత నైపుణ్యం అలవర్చుకోవాలి : నిరుద్యోగ యువత నైపుణ్యం అలవర్చుకుని పట్టుదలతో ముందుకు వెళ్లి ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేసి వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో రైతులకు డ్రోన్ సేవలు అందించాలని ఆసక్తి ఉన్న సభ్యులకు ప్రభుత్వం సబ్సిడీతో డ్రోన్లను అందించనుందన్నారు. కార్యక్రమంలో రవీంద్ర, కేవీ సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేతలు జి.పుల్లయ్య, కేవీ సుబ్బారెడ్డి, అమర్‌రాజా అధికారి కళ్యాణ్, నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, నాగిరెడ్డి, గంగాధర్‌గౌడ్, జనార్ధన్ ఆచారి, పుల్లారెడ్డి, ఈవీ రమణ మాదేష్ తదితరులు పాల్గొన్నారు.

శరీర దానానికి ముందుకొచ్చిన దంపతులు

- అభినందించిన ప్రిన్సిపాల్



ప్రిన్సిపాల్‌కు శరీరదానం అంగీకార పత్రాన్ని అందిస్తున్న దంపతులు

కర్నూలు హాస్పిటల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలం యనగండ్ల గ్రామానికి చెందిన దినేష్, శకుంతల దంపతులు తమ మరణానంతరం తమ శరీరాలను వైద్యవిద్యార్థుల పరిశోధన నిమిత్తం ఉపయోగించుకోవచ్చుని అంగీకారపత్రాన్ని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వారిని అభినందిస్తూ స్వచ్ఛందంగా శరీర దానం చేయడం ఆదర్శప్రాయమని అన్నారు.

గందరగోళంగా సీనియారిటీ లిస్టు

కర్నూలు హాస్పిటల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్ల సీనియారిటీ లిస్టు గందరగోళంగా తయారైంది. జిల్లాల వారీగా విడుదల చేసిన ఈ జాబితాలో కొందరి పదోన్నతుల పేర్లు పొందుపరచడం పై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. జీవో.నెం.273 ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో మెరిట్, రోస్టర్ ద్వారా మాత్రమే రీడిప్లాయిమెంట్ చేయాలని హెల్త్ అసిస్టెంట్లు కోరుతున్నారు. సీనియారిటీ జాబితాను ఏ జిల్లాకు ఆ జిల్లాకు కౌన్సిలింగ్ చేస్తే కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కిందకు వస్తుందన్నారు. అలాగే కౌన్సిలింగ్‌లో ట్రైబల్ తెగలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

యువతి ఆత్మహత్య

డోన్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం గ్రామంలో వట్టివల్ల రజిత (20) అనే యువతి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. తండ్రి లక్ష్మన్న ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని రజిత గ్రామ సమీపంలోని పొలం వద్ద ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

కమ్యూనిస్టులంటే నాకు గౌరవం

- దుర్భాషలాడినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం
- టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య



అభివృద్ధికి నోచుకోని నాటి లలితకళా సమితి చిత్రం చూపిస్తున్న పత్తి ఓబులయ్య, సమితి సభ్యులు

కర్నూలు కల్చరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టులంటే తనకు ఎంతో గౌరవభావం ఉందని, తాను వారిని దుర్భాషలాడినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అన్నారు. శనివారం సాయంత్రం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని చెప్పారు. తాను కళారంగానికి తప్ప రాజకీయ రంగం గురించి ఎప్పు డూ చర్చించనని స్పష్టం చేశారు. టీజీవీ కళాక్షేత్రం నేడు రాష్ట్రంలోనే పేరుపొందిన కళాసంస్థగా రూపుదిద్దుకుందని చెప్పారు. ఒకనాడు ఆరుబయలు కళాక్షేత్రంగా ఉన్నదాన్ని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ సహకారంతో సుందరమైన కళాక్షేత్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. నిత్యం కళారూపాలతో విరాజిల్లుతున్న కళాక్షేత్రంపై అందరి దృష్టి ఉంటుందన్నారు. కావాలనే అపవాదులు వేస్తున్న కొందరు తీరును మార్చుకోవాలన్నారు. తనకు కళాక్షేత్రంపై సంపాదించి బతకాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కళాక్షేత్రం అభివృద్ధికి నగర ప్రజలు సహకరించాలని కోరారు. ఇప్పుడు జరిగిన సంఘటన కమ్యూనిస్టు నాయకులు మర్చిపోవాలని కోరారు. కళారంగానికే టీజీవీ కళాక్షేత్రం పని చేస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు 38 నంది అవార్డులు సాధించి రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉన్నా మని, ఈ క్షేత్రాన్ని అభివృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. తనపైన దర్నాలో చేసిన అపవాదులను ఖండిస్తున్నానన్నారు. ఏ ప్రభుత్వ శాఖ అధికారులైన వచ్చి లెక్కలు చూసుకోవచ్చని, టీజీవీ కళాక్షేత్రం ప్రతి ఏటా ఆడిట్ రిపోర్టు ఆదాయ పన్నుల శాఖచే ఆమోదం పొందుతోందని అన్నారు. ఈ సమావేశంలో కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు పి. రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, సీవీ రెడ్డి, సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న, ఎండీ క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల పత్తి దహనం

మంత్రాలయం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన కురువ హుశేనికి చెందిన 20 క్వింటాళ్ల పత్తి దహనమైంది. ఇంట్లో భద్రపరుచుకున్న పత్తికి గుర్తు తెలియని వ్యక్తులు కిటికీలో నుంచి నిప్పు పెట్టారు. దీంతో 20 క్వింటాళ్ల పత్తి కాలి బూడిదైపోయింది. పక్కనే ఉన్న ఇరుగు పొరుగు వారు మంటలను ఆర్పే ప్రయత్నం చేసి పొలంలో ఉన్న ఇంటి యజమానికి సమాచారం ఇచ్చారు. యజమాని వచ్చేలోపే పత్తి కాలి బూడిదైంది. పత్తి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని, మరో రెండు రోజుల్లో అమ్ముకుందామని సిద్ధమవుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి తీవ్ర నష్టం కలిగించారని వాపోయాడు. ప్రభుత్వం పత్తి రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువకుడి అదృశ్యం కలకలం

- బెట్టింగ్ యాప్స్ దెబ్బకు రూ.13 లక్షల అప్పులు
- ఆత్మహత్య చేసుకుంటున్నానని ఆరు పేజీల లేఖ
- ఐదు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు



నిరంజన్

ఆత్మకూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్ దెబ్బకు నిరంజన్(26) అనే ఓ యువకుడు సూసైడ్ లెటర్ రాసి అదృశ్యమైన ఘటన ఆత్మకూరు ప్రాంతంలో కలకలం రేపుతోంది. పట్టణంలోని తిక్కయ్యస్వామి దర్గా సమీపంలో నివాసం ఉంటున్న ఆర్టీసీ డ్రైవర్ మహబూబ్‌బాషా కుమారుడు నిరంజన్ ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఫైనాన్స్ రంగంలో తనకున్న అనుభవంతో క్రెడిట్ కార్డు, ఇతర యాప్‌ల ద్వారా సుమారు రూ.13 లక్షల వరకు అప్పులు తీసుకున్నాడు. ఈ డబ్బంతా బెట్టింగ్ యాప్‌ల్లో పోగొట్టుకున్నాడు. దీనికితోడు కొందరి నుంచి డబ్బు తీసుకొని వారి పేరిట తన ఫైనాన్స్ సంస్థ ద్వారా కావాల్సిన సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కొనుగోలు చేశాడు. ప్రస్తుతం వారు ఫైనాన్స్ కంపెనీకి ఎలాంటి అప్పు లేనప్పటికీ వారి పేరిట అప్పు చూపిస్తూ కంపెనీ వారి నుంచి ఒత్తిళ్లు రావడంతో బాధితులందరూ అతన్ని నిలదీసినట్లు తెలిసింది. మొత్తానికి చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఆరు పేజీలతో కూడిన సూసైడ్ నోట్ రాశాడు. తల్లిదండ్రులు, భార్య తనను క్షమించాలని వేడుకుంటూనే తాను మరణిస్తే తన పేరిట ఎల్ఐసీ బాండ్ల ద్వారా వచ్చే డబ్బుతో అప్పులు ఇచ్చిన వారికి తిరిగి చెల్లించాలని అందులో రాసి కనిపించకుండా పోయాడు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు విషయాన్ని తెలియజేశారు. ఈ క్రమంలోనే విచారణ చేపట్టిన పోలీసులు శుక్రవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో తన బైక్‌ను రఘునాథ్ సెంటర్‌లో వదిలేసి నంద్యాల టర్నింగ్ వైపు నడుచుకుంటూ వెళ్లినట్టు సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. శనివారం రాత్రి వరకు అతని ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీలు, బంధువులు అన్ని ప్రాంతాల్లో వెతుకుతున్నారు. అర్బన్ సీఐ రాము నేతృత్వంలో ఆరు బృందాలు ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలావుంటే నిరంజన్‌కు ఏడు నెలల క్రితమే వివాహమైంది. ఇంతలోనే ఇతను అదృశ్యం కావడం ఆ కుటుంబంలో ఆందోళన రేపుతోంది. గతంలో కూడా నిరంజన్ ఇదే తరహాలో రూ.8లక్షల వరకు బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లి అప్పులపాలవగా ఆయన తండ్రి మహెబూబ్‌బాషా వాటిని తీర్చాడు. మళ్లీ ఆ యువకుడు బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లి ఆత్మహత్య వరకు వెళ్లడం గమనార్హం.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

గృహ వినియోగదారుడే ఉత్పత్తిదారుడు

చాగలమర్రి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా గృహ వినియోగదారుడు విద్యుత్ ఉత్పత్తిదారుడిగా మారే అవకాశం కలుగుతుందని ఆళ్లగడ్డ విద్యుత్‌శాఖ ఏడీఈ రవి కాంత్‌చౌదరి తెలిపారు. చాగలమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వినియోదారులు విద్యుత్ సిబ్బందికి ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యుత్ ఇన్‌చార్జి ఏఈ రమణయ్య, లైన్‌ఇన్‌స్పెక్టర్లు సుబ్రమణ్యం, తిరుపతయ్య, లైన్‌మెన్‌లు, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

బనగానపల్లె: సూర్య ఘర్ యోజనను విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏడీ మద్దిలేటి కోరారు. శనివారం విద్యుత్ కార్యాలయంలో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, గర్జప్ప, శ్రీకృష్ణ, సోలార్ ఏజెంట్ మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 25(ఆంధ్రజ్యోతి): కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం నిర్వహిస్తున్న బైక్, ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. శనివారం పట్టణంలోని పురపాలకసంఘం కార్యాలయంలో పలు విషయాలపై కమిషనర్ కిషోర్‌తో చర్చించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటయ్య, సాల్మన్, సుబ్బరాయుడు, సత్యం, రాజేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

దొర్నిపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని చాకరాజువేముల పూర్వ విద్యార్థులు పోనయ్య శ్రీను, ఉసేన్‌వలి, జాకిర్‌హుసేన్ అన్నారు. శనివవారం చాక రాజు వేముల మండల పరిషత్ ప్రాథమిక మెయిన్ పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం ఉండటంతో పూర్వ విద్యార్థులు స్వచ్ఛత పనులు చేపట్టారు. కార్యక్రమంలో అబ్దుల్ కలామ్, మోహన్‌రాజు, తిరుపతయ్య, ఎండూరి మధు, అశోక్, బరిగెల నరసింహుడు ఉన్నారు.

ఎవరికీ పైసలివ్వొద్దు

- వీఆర్వోలపై చర్యలు తీసుకుంటాం: తహసీల్దార్

సంజామల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరికీ పైసలివ్వొద్దని తహసీల్దారు అనిల్‌కుమార్ సూచించారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం 'పైసలిస్తేనే పనులు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ అనిల్ కుమార్ స్పందించారు. అవినీతికి పాల్పడుతున్న ఆ ఇద్దరు వీఆర్వోలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే తమ దృష్టికి తీసుకొని రావాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలమూరు గ్రామంలో పార్వేట పల్లకీలో కొలువుదీరిన ఉత్సవ మూర్తులైన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వాములు ప్రత్యేక పూజలు చేశారు. పల్లెపల్లెనా పండుగ సందడి నెలకొంది. ప్రతి ఏడాది అహోబిళ క్షేత్రం నుంచి మకరసంక్రాంతిన పార్వేట పల్లకీ ప్రారంభం కావడం విధితమే. పల్లకీలో కొలువుదీరిన ఉత్సవమూర్తులను దర్శించుకోవడానికి ప్రతి పల్లెలో తెలుపు తెలుపు వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఏ ఇల్లు చూసినా బంధువులతో ఆడపడుచులతో కళకళలాడుతుంది.

28న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పర్యటన

కొలిమిగుండ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఈ నెల 28న కొలిమిగుండ్లలో పర్యటిస్తారని ఎంపీడీవో ప్రసాదరెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 2గంటలకు మండలస్థాయి అధికారులతో మండల అభివృద్ధిపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తారన్నారు. ప్రతి అధికారి తమ శాఖల ప్రగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కొలిమిగుండ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల శాంతి నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి సంబంధించి సీసీ రోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఇటీవల మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి రూ.40లక్షలు నిధులు కేటాయించారు. శనివారం ముందుగా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. టీడీపీ నాయకులు గూలి నాగేశ్వరరెడ్డి, నిమ్మకాయల దస్తగిరి, బొట్టుస్వామి, భూపాల్‌రెడ్డి, చంద్రమోహన్‌యాదవ్, శేఖర్ పాల్గొన్నారు.

మంచి నీటి కొళాయిల వితరణ

చాగలమర్రి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంచి నీటి సౌకర్యం కల్పించేందుకు పూర్వ విద్యార్థి కాస చంద్రశేఖర్‌రెడ్డి రూ.10 వేలు, గణిత ఉపాధ్యాయుడు రవీంద్రారెడ్డి రూ.10 వేలు వెచ్చించి కొళాయిలను ఏర్పాటు చేశారు. శనివారం కొళాయిలను పాఠశాల కమిటీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, టీడీపీ నాయకుడు జెట్టి నాగరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాస్త్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ హత్య దుర్మార్గం

కోవెలకుంట్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఆలూరు మండలం అడిగెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంటుగా పనిచేసే బండారు వీరన్నను దారుణంగా హత్య చేయడం దుర్మార్గమని ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్‌ఆర్‌జీఎస్ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంటు జయభారత్‌రెడ్డి, కొండారెడ్డి, రాధాదేవి, ఫక్రుద్దీన్ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్య చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రుద్రవరం : ఉపాధి హామీ పథకం సిబ్బందిపై దాడి అమానుషమని ఏపీవో ప్రతాప్, వీసీ సుబ్బన్న అన్నారు. శనివారం రుద్రవరంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

ఉయ్యాలవాడ: ఫీల్డ్ అసిస్టెంట్ హత్య నిందితులను కఠినంగా శిక్షించాలని ఉపాధి ఏపీవో రవిప్రకాష్ తెలిపారు. కర్నూలు జిల్లా ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంటు కురువ ఈరన్న హత్యకు నిరసనగా శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈసీ షరీఫ్, పీరా, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మురికి కాల్వలో మృత శిశువు

కోవెలకుంట్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంత పేటలో మిల్టరీ మద్దిలేటి ఇంటి సమీపంలో ఉన్న మురికి కాల్వలో అప్పుడే పుట్టిన పసికందును గుర్తు తెలియని వ్యక్తులు పారేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు పసికందును బయటికి తీసి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ క్రిష్ణానాయక్ అక్కడికి చేరుకుని పసికందును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు చేయగా అప్పటికే శిశువు మృతి చెందిందని వైద్యులు గుర్తించారు. మృతి చెందిన పసికందుకు విక్కీ ఫౌండేషన్ నిర్వాహకులు అంత్యక్రియలు చేశారు.

గత పాలకుల పాపాలే శాపాలు

● మండల సర్వసభ్య సమావేశంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి



మండల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

అవుకు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : గతంలో వైసీపీ పాలకులు చేసిన పాపాలు రాష్ట్రానికి శాపాలుగా మారాయని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి మంత్రి బీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సమస్యలపై శాఖల వారిగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం మంత్రి బీసీ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలోని 5 మండలాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా రూ. 530 కోట్లతో ప్రణాళికలు రూపొందించామని అన్నారు. అవుకు రిజర్వాయర్ నుంచి పైపులైన్లు వేసి, ఆరు ఓహెచ్ఆర్ ట్యాంకులను ఏర్పాటు చేసి ప్రతి గ్రామానికి తాగునీరు అందే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అనంతపురం టు అమరావతి 544డీ రహదారి పనులు మరల కార్యరూపం దాల్చుతుందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నదుల అనుసంధానం కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో వెంగన్న, తహసీల్దార్ మల్లికార్జున రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ నాగ శ్రీనివాసులు, ఇన్‌చార్జి ఏపీవో ప్రకాష్‌రావు, వ్యవసా యాధికారి అబ్దుల్ హక్, ఎంఈవో శ్రీధర్‌రావు, ట్రాన్స్‌కో ఏడీ సతీష్ కు మార్‌రెడ్డి, ఎస్సార్బీసీ ఈఈ సురేష్‌బాబు, డాక్టర్లు అభినయ్, యమున, ఎంఈవో-2 వెంకటేశ్వరరెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ పక్కీరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌బాబు, పశువైద్యాధికారి భారతీదేవి, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి, సీడీపీవో ఉమా మహేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ రామప్ప, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి అడుగులు

అవుకు పట్టణం అభివృద్ధికి అడుగులు పడుతున్నట్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణానికి చేరుకున్న మంత్రి బీసీకి టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరరెడ్డి, చల్లా విజయభాస్కర్‌రెడ్డి, ఉగ్రసేనారెడ్డి, మొట్ల రామిరెడ్డి, మద్దిలేటిగౌడు, వెంకటరమణ నాయక్, దంతెల రమణ, తిక్కన్న ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. చెన్నకేశవ ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. అనంతరం కోట వీధిలో సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం తేరు వీధి నుంచి రాజవీధి, అమ్మవారిశాల వీధి వరకు వెళ్లి రోడ్ల పరిస్థితిని పరిశీలించారు. మండపం వీధి నుంచి తేరు వీధి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డును, పాతపోస్టాఫీస్ రోడ్డును వెడల్పు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాటసాని చంద్రశేఖర్‌రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జు నరెడ్డి, వంగల పరమేశ్వరరెడ్డి, అరుణ్‌కుమార్‌నాయక్, వెంకటరాముడు నాయక్, రఘు రామిరెడ్డి, నారపురెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవుకు ఆసుపత్రిని ఆదర్శంగా తీసుకోవాలి

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు అవుకు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అభినయ్‌ను అభినందించారు. వైద్యులు రవికుమార్, జయరాముడు, కళ్యాణ్ శ్రీనివాస్, ఇందిరకళ్యాణి, సుష్మా, సుధాప్రియాంక పాల్గొన్నారు.

ప్రజలు మార్పును గమనిస్తున్నారు

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

- నియోజకవర్గంలో రూ.13.46 కోట్లతో సీసీ రహదారులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 25(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని ఓబుళంపల్లె, యాదవాడ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.13.46 కోట్లతో 240 పనులు ప్రారంభించగా ఇప్పటి వరకు 211 పనులు పూర్తయ్యాయన్నారు. వైసీపీ హయాంలో సర్పంచ్‌ల నిధులను దొంగచాటుగా కాజేసి గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేశారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో పంచాయతీ వ్యవస్థకు, గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. నియోజకవర్గంలో ఇళ్లులేని వారికి స్థలాలు కేటాయించడంతో పాటు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శీలం హరికుమార్‌రెడ్డి, గౌరు రామకృష్ణారెడ్డి, శంకర్, వెంకటరామిరెడ్డి, నరసింహుడు, హుస్సేన్ బాషా, రామ్మోహన్‌రెడ్డి, శివారెడ్డి, ఉపేంద్ర, పలువురు అధికారులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అఖిలప్రియ

రైతుల సంక్షేమమే లక్ష్యం

డోన్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం పట్టణంలోని మార్కెట్ యార్డులో నాఫెడ్, ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో రైతులను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. డోన్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రంను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాఫెడ్ , మార్క్‌ఫెడ్ జిల్లా అధికారులు హరినాథ రెడ్డి, తులసి రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వలసల రామకృష్ణ, కోట్రికే ఫణిరాజ్, నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, ఓబులాపురం శేషిరెడ్డి, పెద్దకేశవయ్య గౌడు, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు వడ్డె మహారాజ్, గడ్డం బ్రహ్మం పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఉచిత అంబులెన్స్ సేవా వాహనం సేవలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శనివారం కోట్ల కుటుంబం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ సేవా వాహనాన్ని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ జెండా ఊపి ప్రారంభించారు. డోన్ వంద పడకల ఆసుపత్రి వద్ద జరిగిన ఈ కార్యక్రమం ఉద్దేశించి ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వంద పడకల ఆసుపత్రి వైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



డోన్‌లో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

ఘనంగా ఓటర్ల జాతీయ దినోత్సవం

చాగలమర్రి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని రెవెన్యూ అధికారులు, విద్యార్థులు, బీఎల్‌వోలు కలిసి శనివారం ఘనంగా నిర్వహించారు. వాసవీ ఎయిడెడ్ డిగ్రీ కళాశాల నుంచి వీధుల గుండా అవగాహన ర్యాలీ చేశారు. పెద్దమకానం వీధిలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు ఎంతో విలువైందని, 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, ప్రిన్సిపాల్ శ్యాబుద్దిన్, ఎన్ఎస్ఎస్ అధికారి మహేశ్వరయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో వీఆర్వో భాగ్యలక్ష్మి, ఓబులేసులు టీడీపీ నాయకులు పెనుగొండ రాజశేఖర్, మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రవరం: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా రుద్రవరం తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ సిటిజన్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దారు మల్లిఖార్జునరావు, డీటీ చంద్రశేఖరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ప్రాథమిక హక్కుగా భావించాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, ఆర్ఐ అంకన్న, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

బనగానపల్లె: పట్టణంలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ అధ్యాపకుడు బడేసాహెబ్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఓటరు దినోత్సవం పురస్కరించుకొని కళాశాలలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు మహ్మద్‌గౌస్, సూర్యనారాయణరెడ్డి, బాబూనాథ్, ఉమామహేశ్వరరెడ్డి, నాగరాజారెడ్డి, సీతమ్మ, కౌసల్యాదేవి, రామన్న, రిశీశ్వరుడు పాల్గొన్నారు.

దొర్నిపాడు: దొర్నిపాడు ఎంపీడీవో కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

డోన్ రూరల్ : పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చాగలమర్రిలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, రెవెన్యూ అధికారులు

అటవీ సంపద సంరక్షణకు కృషి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 25(ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలోని వన్యప్రాణుల, అటవీ సంపద సంరక్షణకు కృషి చేయాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సూచించారు. అటవీశాఖ రేంజర్ శ్రీపతి నాయుడు, సిబ్బంది ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ దంపతులను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.అలాగే టీడీపీ నాయకుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డిని కలిశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో నిర్వహించిన ఆన్యువల్ స్పోర్ట్స్ డే కార్యక్రమానికి ఎమ్మెల్యే శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల యాజమాన్యం విజ్ఞప్తి మేరకు ఆరునెలల్లో రహదారిని నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆటోమేటెడ్ టెస్టింగ్ సేవలు ప్రారంభం


డోన్ రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) సేవలు శనివారం నుంచి తిగిరి ప్రారంభమైందని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల ట్రాన్స్‌పోర్టు వాహనాదారులు గమనించాలని డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్టేట్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ విజయవాడ ఆదేశాల మేరకు అన్ని మాన్యువల్ ఫిట్నెస్ తనిఖీలను నిలిపివేసినట్లు తెలిపారు. రెన్యూవల్ కోసం నంద్యాలలోని చాకిరేవు వద్ద ఏర్పాటు చేసిన ఏటీఎస్ కు ట్రాన్స్‌పోర్టు వాహనాదారులు వెళ్లాల్సిందిగా ఆయన కోరారు.

నేడు ట్రాక్టరు, బైకు ర్యాలీ

రుద్రవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ట్రాక్టరు, జీపు, బైక్ ర్యాలీని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు శనివారం తెలిపారు. రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక, కర్షక హక్కుల సాధన కోసం ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అవార్డు గ్రహీతకు సత్కారం

బనగానపల్లె, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో యనకండ్ల వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి లతకు బెంగుళూరులో జైవిక్ ఇండియా అవార్డు రావడం హర్షనీయమని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆమెను బీసీ ఇందిరమ్మ శాలువాతో సత్కరించారు. అనంతరం బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ రాబోయేరోజుల్లో లతకు మరిన్ని అవార్డులు రావాలని ఆకాంక్షించారు.



లతను సత్కరిస్తున్న బీసీ ఇందిరమ్మ

పర్యావరణాన్ని కాపాడుకుందాం

బనగానపల్లె, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని జాతీయ పర్యావరణ విద్య సంచాలకులు స్రవంతి కోరారు. శనివారం పట్టణంలోని నెహ్రూ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లాపర్యావరణ సమన్వయ కర్త చంద్రశేఖర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం కమల్‌తేజారెడ్డి, రాష్ట్ర ప్రాజెక్టు అధికారులు సత్యనారాయణ, ప్రసాదరావు, పీఆర్‌పీ శ్రీరామ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ తహసీల్దార్‌కు బెస్ట్ ఎలక్టోరల్ అవార్డు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 25(ఆంధ్రజ్యోతి) : నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ తహసీల్దార్ జ్యోతి రత్నకుమారికి బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు దక్కింది. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ విజయానంద్ చేతులమీదుగా శనివారం ఆమె అవార్డును అందుకున్నారు. నంద్యాల జిల్లా నుంచి ఉత్తమ ఏఈఆర్‌వోగా(అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్) ఎంపికై అవార్డు అందుకున్న తహసీల్దార్ జ్యోతి రత్నకుమారికి పలువురు రెవెన్యూ అధికారులు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో వచ్చిన అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని తహసీల్దార్ అన్నారు.



సీఎస్ నుంచి అవార్డు అందుకుంటున్న తహసీల్దార్

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

చాగలమర్రి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని హెచ్ఎం శాస్త్రీ, టోల్‌ప్లాజా హెడ్ మదన్‌మోహన్ తెలిపారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పారామెడికల్ అబ్దుల్‌కలామ్ రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు పీపీఆర్ నిర్వహించడంపై డెమో చేశారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ అరుణ్‌రాజ్, మేనేజర్ ఖాదర్‌వలి, హెచ్‌సీ శంకర్, ఆర్‌వోఎం సరేష్‌రెడ్డి, టోల్‌ప్లాజా మేనేజర్ ప్రదీప్ మాలిక్, రూల్ ఆఫీసర్ కుతుబుద్దిన్, బాష, పీడీ దాదాపీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

31నుంచి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు

కోవెలకుంట్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సభాపతి రోడ్డులో నిర్మించిన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు నిర్వహించనున్నట్లు దేవస్థాన భక్తభజన బృందం సభ్యులు శనివారం తెలిపారు. 31న ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, 1న ప్రాతఃకాలపూజ, కుంకుమార్చన, ధాన్యాధివాసం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు, 2న తెల్లవారుజామున 4.30గంటలకు ధ్వజ శిఖర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ హోమం, ప్రాణ ప్రతిష్ఠ, 11.50గంటలకు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిష్ఠ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా వెంకటేశ్వర స్వామి పల్లకి ఉత్సవం

చాగలమర్రి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదురాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులతో శనివారం వైభవంగా పల్లకి ఉత్సవం నిర్వహించారు. మహిళలు గోవిందనామ పారాయణం నిర్వహించారు. చాగలమర్రిలోని పట్టాభిరామ, వీరాంజనేయస్వామి ఆలయాల్లో మహిళలు సామూహిక భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

వాసాపురంలో..

రుద్రవరం: మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వెంకటేశ్వరస్వామి లక్ష్మీగోదాదేవి అమ్మవారు, మానస లింగేశ్వరస్వామి, త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకంగా కుంకుమార్చన చేశారు.

చెరువులో మట్టి తవ్వకాలు

రుద్రవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటకొండ, పోలన్న చెరువులో ఎక్స్‌కవేటర్లు పెట్టి అక్రమంగా మట్టి తవ్వ కాలు చేపట్టారు. మట్టిని తవ్వి టిప్పర్లలో నంద్యాల ప్రాంతంలోని ఇటుకల బట్టీలకు తరలించినట్లు శనివారం స్థానికులు తెలిపారు. చెరువు గట్టుకు ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయంపై వీఆర్వో గురుస్వామి మాట్లాడుతూ చెరువులో మట్టి తవ్వేందుకు ఎలాంటి అనుమతి లేదన్నారు.శనివారం చెరువును పరిశీలించినట్లు తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఎంఈవోగా వీరరాఘవయ్య

రుద్రవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఎంఈవోగా వీరరాఘవయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోను ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు గడ్డి వాములు దగ్ధం

కొలిమిగుండ్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి కొండ సమీపంలో నిల్వ చేసుకున్న రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కాళ్లూరి నరసింహులు పశువుల మేత కోసం రూ.50వేల విలువ గల వరి గడ్డిని దొడ్డిలో నిల్వ చేసుకున్నాడు. శనివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

తంగిరాల మృతికి సంతాపం

ఉయ్యాలవాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ జానపద విజ్ఞాన వేత్త ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు(92) మృతికి ఉయ్యాలవాడ నరసింహరెడ్డి వంశస్తులు కర్నాటి ప్రభాకర్‌రెడ్డి, వడ్డె ఓబన్న వంశస్తుడు నరసింహులు, రేనాటి సూర్యచంద్రుల సేవా సమితి అధ్యక్షుడు డీకే బాబులు సంతాపం ప్రకటించారు. ఆదివారం జరిగే ఆయన అంత్యక్రియల్లో పాల్గొనేందుకు బెంగుళూరు సిటీకి బయలుదేరి వెళ్లారు.

ముగిసిన మౌలాలి స్వామి ఉరుసు

ప్యాపిలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పోతుదొడ్డి గ్రామంలో మూడు రోజుల పాటు జరిగిన హజరత్ మౌలాలిస్వామి ఉరుసు శనివారం ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుర్రంపై స్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

బనగానపల్లె, జనవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో యాగంటి క్షేత్రం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి శనివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివరాత్రి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 25నుంచి ప్రారంభమవుతాయని ఈవో చంద్రుడు తెలిపారు. 25న ధ్వజారోహణం, 26న మహాశివరాత్రి జాగారణ, 27న ఉమామహేశ్వరస్వామి కల్యాణం, 28న రథోత్సవం, మార్చి 1న శివదీక్ష విరమణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, పూజారి మహేశ్, మనోజ్, జోలాపురం తిరుమలయ్య, శంఖేశ్వరరెడ్డి, రామశేఖర్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



యాగంటి క్షేత్రం మహాశివరాత్రి పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి